TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 40 | మంగళవారం, మే 21, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4



ఏపీలో జూన్ 4న

## ఓట్ల లెక్కింపు

**కౌంటింగ్ నేపథ్యంలో పిఠాపురం, కాకినాడలో హింసకు అవకాశం... నిఘా వర్గాల నివేదిక!**

**ఇంటెలిజెన్స్ నివేదిక నేపథ్యంలో అప్రమత్తమైన ఈసీ కాకినాడ, పిఠాపురంలో భారీ బందోబస్తుకు చర్యలు**

న్యూఢిల్లీ,మే,20: ఏపీలో మే 13న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరగ్గా, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. కౌంటింగ్ తేదీ దగ్గరపడుతుండడంతో రాజకీయ పార్టీల్లో టెన్షన్ పెరుగుతోంది. అదే సమయంలో ఏపీ ఎన్నికల ఫలితాల కోసం ప్రజలు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈసీకి నిఘా వర్గాల నుంచి కీలక నివేదిక అందింది. కౌంటింగ్ నేపథ్యంలో పిఠాపురం, కాకినాడ నగరంలో హింస చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయన్నది ఆ నివేదిక సారాంశం. కౌంటింగ్ కు ముందు, తర్వాత హింసాత్మక ఘటనలు జరిగే అవకాశముందని ఇంటెలిజెన్స్ విభాగం పేర్కొంది. ఈ నివేదికను దృష్టిలో ఉంచుకుని, కాకినాడలోని ఏటిమొగ, దుమ్ములపేట, రామకృష్ణారావుపేటపై ఈసీ ప్రత్యేక దృష్టి పెట్టింది.

ఇరాన్ అధ్యక్షుడి మరణం పట్ల

## ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి



న్యూఢిల్లీ,మే,20: అజర్ బైజాన్ సరిహద్దుల నుంచి తిరిగి వస్తూ, వాతావరణం అనుకూలించక హెలికాప్టర్ కూలిపో యిన ఘటనలో ఇరాన్ అధ్యక్షుడు దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే. దీనిపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించా రు. 1 ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ ఇబ్రహీం రైసీ విషాదకర రీతిలో మరణించ డం తన ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మోదీ పేర్కొన్నారు. భారత్-ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం కోసం రైసీ చేసిన కృషి చిరస్మరణీ యం అని కొనియాడారు.

# బెంగళూరు శివారులో రేవ్ పార్టీ...



- మాదక ద్రవ్యాలు వినియోగించినట్లు గుర్తింపు
- పార్టీలో పాల్గొన్న ప్రముఖులు, టీవి,సినీ నటులు
- వందమందికి పైగా అరెస్ట్..
- పలు ఖరీదైన కార్లు స్వాధీనం
- మంత్రి కాకాణి గోవర్ధన్ స్టిక్కర్ లభ్యం
- రేవ్ పార్టీలో పాల్గొనలేదని నటి హేమ వివరణ

**బెంగళూరు,మే20:**
బెంగళూరు శివారులో నిర్వహించిన రేవ్ పార్టీలో పలువురు తెలుగు టీవీ నటీనటులు, మోడళ్లు పట్టుబడ్డారు. ఓ వ్యాపార వేత్తకు చెందిన ఫామ్ హౌస్‌లో బర్త్ డే పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దాటినతర్వాత దాడి చేశారు. దాదాపు 100 మందికి పైగా పార్టీకి హాజరయ్యారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. ఇదే పార్టీకి వచ్చిన ఓ కారులో ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సంబంధించిన స్టిక్కర్ దొరికింది. పార్టీలో పలు రకాల డ్రగ్స్ వాడినట్లు పోలీసులు గుర్తించారు. 17 గ్రాముల ఎండీఎంఏ పిల్స్, కొకైన్‌ను స్వాధీనం చేసు కున్నారు. ఫామ్ హౌస్ పరిసరాల్లో జాగ్వార్, బెంజ్ సహా ఖరీదైన 15 ఖరీదైన కార్లను జప్తు చేశారు. ఐదుగురిని అరెస్టు చేసిన ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈరేవ్ పార్టీలో లిక్కర్‌తో పాటుగా పెద్ద ఎత్తున డ్రగ్స్ కూడా లభ్యం అయ్యాయి. జీఆర్‌ఫామ్‌హౌస్ అనేది హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యక్తికి చెందినది తేల్చారు. ఈ పార్టీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నట్లు బెంగుళూరు పోలీసులు గుర్తించారు. టీవీ నటులు సహా,మోడల్స్, పలువురు వ్యాపార, రాజకీయ వారసులు కూడా రేవ్ పార్టీలో పాల్గొన్నట్లుగా చెబుతున్నారు. సీసీబీ సోదాల్లో ఎండీఎంఏ సహాపలు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. జాగ్వార్ లాంటి ఖరీదైన కార్లతో పాటు మొత్తం ఐదుగురిని సీసీబీ అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో బెంగళూరు శివారులో నిర్వహించిన రేవ్ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలుగు సినీనటి హేమ స్పష్టం చేశారు.



## మద్యం పాలసీ కేసులో కవిత జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు

*రిమాండ్‌ను జూన్ 3 వరకు పొడిగించిన రౌస్ అవెన్యూ కోర్టు*

న్యూఢిల్లీ,మే,20: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషి యల్ రిమాండ్‌ను రౌస్ అవెన్యూ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం పొడిగించింది. కవిత జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగిస్తూ జడ్జి కావేరీ బవేజా ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం పాలసీ కేసులో కవితను రెండు నెలల క్రితం ఈడీ అరెస్ట్ చేసింది. రెండు నెలలుగా ఆమె తీహార్ జైల్లో ఉంటున్నారు. ఆమెజ్యుడీషియల్ రిమాండ్‌ను సీబీఐ ప్రత్యేక కోర్టు పలుమార్లు పొడిగించింది. జూన్ 3వ తేదీ వరకు కవిత రిమాండ్‌ను కోర్టు పొడిగించింది.



కలెక్టర్లకు ధాన్యం కొనుగోలు

## బాధ్యతలు

- రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సోనియా గాంధీని ఆహ్వానించాలని కేబినెట్ నిర్ణయం
- దాదాపు నాలుగు గంటల పాటు జరిగిన కేబినెట్
- కీలక అంశాలపై చర్చ
- సన్న వడ్లకు రూ.500 బోనస్ : కేబినెట్ నిర్ణయం

**హైదరాబాద్,మే,20:**
జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీని ఆహ్వానించాలని తెలం గాణ మంత్రివర్గం నిర్ణయించింది. సోమవారం మధ్యాహ్నం ఈసీ షరతులతో కూడిన అనుమతి ఇచ్చిన అనంతరం సచివాలయంలో కేబినెట్ భేటీ జరిగింది. దాదాపు నాలుగు గంటలపాటు జరిగిన ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్ర అవతరణ వేడుకలు,ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై చర్చించారు. జూన్2నరాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగానిర్వహిం చాలని నిర్ణయించారు. ధాన్యం కొనుగోళ్లపైకూడా కేబినెట్లో చర్చించారు. ఈ బాధ్యత పూర్తిగా ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగిస్తూమంత్రివర్గం నిర్ణ యం తీసుకుంది. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండాచివరి గింజవరకు కొనాలని ఆదే శాలుజారీ చేసింది.సన్నవడ్లకు రూ. 500 బోన స్ ఇవ్వాలని కేబినెట్ తీర్మానం చేసింది.

# దేశవ్యాప్తంగా ఐదో దశ పోలింగ్

## పలు ప్రాంతాల్లో ఓటేసిన ప్రముఖులు

**అమేథీలో స్మృతిఇరాణి,లక్నోలో రాజ్‌నాథ్,మాయావతి ఓటు వినియోగం**

**ముంబైలో ఓటేసిన అక్షయ్ కుమార్, జాన్వీ...**





న్యూఢిల్లీ,మే20: దేశ వ్యాప్తంగా 5వ దశలోక్ సభ ఎన్నికలకు పోలింగ్ సోమవారం ఉదయం ప్రారంభమయ్యింది. ఆరు రాష్ట్రాలు,రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం 49 నియోజ కవర్గాలకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు సినీ రాజకీయ ప్రముఖులు తమ నియోజక వర్గాల్లో ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. ప్రస్తుత బీజేపీ సిట్టింగ్ ఎంపీ స్మృతి ఇరానీ అమేథీ లోక్‌సభ స్థా నం నుంచి మరోసారి లోక్ సభ స్థానానికి పోటీ చేస్తున్నారు.

ఈసందర్భంగా ఆమె అమేథీలో నిపోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

ఓటువేసిన అనంతరం మీడియాతోమాట్లాడుతూ..'ఈరోజు తన గ్రామం గౌరీగంజ్‌లో విక సిత్ భారత్ సంకల్పంతో తన ఓటు వే యడం జరిగిందన్నారు. ఇది తనఅదృష్టంగా భావిస్తున్నా అన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోండి.. దేశ భవిష్యత్తుకు బాధ్యతగాఓటు వేయమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఉత్తరప్రదేశ్ లో కూడా పలు స్థానాలకు పోలింగ్ పక్రియ ప్రారంభమైంది. మాజీ సిఎం,బిఎస్పిఅధినేత్రి మాయావతి లక్నోలోని పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేశారు. అనంతరం సిరా వేలును చూపి అందరినీ ఓటు వేయమని సందేశం ఇచ్చారు.

ముంబై నార్త్ నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పీయూష్ గోయల్ బరిలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయన తన ఓటు హక్కును వినియోగించుకుని ముంబై ప్రజలు దేశానికి మంచి భవిష్యత్తు కోసం ఓటు వేస్తున్నారని తెలిపారు.


కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ కుటుంబ సమేతంగా పోలింగ్ కేంద్రానికి వచ్చిఓటు వేశారు. ఓటు వేసిన తర్వాత సిరా వేసిన వేలిని కూడా చూపించారు. ఉత్తరప్రదేశ్లో కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ కూడా పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిలబడి ఓటు వేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఐదవ దశ పోలింగ్ సందర్భంగా నటి సన్యా మల్హోత్రా ముంబైలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈమె తో పాటు పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కూడా ముంబైలో ఓటు వేశారు.

అలాగే బాలీవుడ్ నటుడు అక్ష యేకుమార్ కూడా తనఓటు హక్కును ముంబై నగరంలో వినియోగించుకున్నారు. పౌరసత్వం వచ్చిన తరువాత తాను వేసిన తొలిఓటుగా పేర్కొన్నారు. నటిజాన్వీ తదితరులు కూడా ఓటేశారు. రిజర్వ్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తి కాంత్ దాస్ కూడా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో

## ఘోర ప్రమాదం...

- వాహనం లోయలోపడి 17 మంది మృతి
- కబీర్‌ధామ్ జిల్లాలో లోయలో పడిన వాహనం
- మృతుల్లో 14 మంది మహిళలు ఉన్నట్లు గుర్తింపు
- బీడీ ఆకుల కోసం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం




కవర్ధా,మే,20: ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. కవర్ధా ప్రాంతంలో వాహనం బోల్తాపడి 17 మంది మృతి చెందారు. 8 మందికి గాయాలయ్యాయి. కబీర్‌ధామ్ జిల్లాలో ఓ లోయలో వాహనం పడిపోయింది. మృతుల్లో 14 మంది మహిళలు ఉన్నట్లుగా తెలుస్తోంది. బైగా ట్రైబల్ కమ్యూనిటీకి చె ందిన 25 నుంచి 30 మంది బీడీ ఆకుల కోసం వెళ్లారు. ఆకులు ఏరిన తర్వాత వారిని పికప్ వాహనం వెనక్కి తీసుకువస్తోంది. ఈ సమయంలో వాహనం లోయలోకి బోల్తా కొట్టింది. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ వాహనంలో ప్రయాణిస్తున్న వారంతా కుయ్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. బైగా కమ్యూని టీ ఎక్కువగా బీడీలు చేస్తుంది. బీడీ ఆకు కోసం వీరు అడవులకు వెళుతుంటా రు. ఈ ఆకులు మార్చి నుంచి మే మధ్య వస్తాయి.

నల్గొండ జిల్లాలో

## ఘోర రోడ్డు ప్రమాదం..


- టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టిన కంటైనర్ లారీ
- ప్రమాదంలో 8 మందికి తీవ్ర గాయాలు
- నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ఘోర రోడ్డు ప్రమాదం




మిర్యాలగూడ,మే,20: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల ఘోర రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ.. అమాయకుల ప్రాణాలుబలి తీసుకుంటున్నారు. ఓవర్ స్పీడ్,రాంగ్‌రూట్లలో వచ్చి ప్రమాదాల కు కారణమవుతున్నారు. తాజాగా.. నల్గొండ జిల్లాలో ఘోరరోడ్డ ప్రమాదం చోటు చేసుకుంది. అదుపుతప్పిన ఓకంటెనర్ లారీ మందున్న టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టింది.

మిర్యాల గూడ పట్టణం నందిపాడు బైపాస్ వద్ద ఈ ఘటన జరిగింది. రహదారిపై జంక్షన్ వాహనాలు నెమ్మదిగా వెళ్లేందుకు గాను స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. వాటిని గమనించిన టాటా ఏస్ డ్రైవర్ వాహనాన్ని స్లో చేశాడు.

అయితే ఆవెనకాలే వస్తున్న కంటైనర్ లారీ..స్పీడ్ బ్రేకర్లను గమనించకుండా అదే స్పీడ్‌తో దూసుకెళ్లింది. ముందున్న టాటా ఏస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘట నతో టాటా ఏస్ వాహనం దాదాపు 10మీటర్లు ముందుకు వెళ్లికిం దప డిపోయింది.



## జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

**వెల్లడించిన బత్తిన కుటుంబ సభ్యులు**

హైదరాబాద్,మే20: మృగశిర కార్తె సందర్భంగా ప్రతి ఏడాది.. బత్తిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం అందిస్తున్నారు. ఈ ఏడాదికూడా చేప ప్రసాదం పంపిణీకి బత్తిని ఫ్యామిలీ సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన వివరాలను వారు మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది మృగశిర కార్తె జూన్ 8న శనివారం ఉదయం పదకొండు గంటలకు ప్రవేశిస్తుంది. జూన్ 8 ఉదయం పదకొండు గంటల నుంచి జూన్ 9వ తేదీ ఉదయం పదకొండు గంటల వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ జరుగుతుందని తెలిపారు. చేప ప్రసాదం పూర్తిగా ఉచితంగా భక్తులకు అందిస్తామని అన్నారు. వివిధ ఫౌండేషన్ల సహకారంతో.. మెడికల్ సర్వీస్, భోజన సౌకర్యం, మంచి నీటి సరఫరా 24 గంటల పాటు ఉచితంగా భక్తులకు ఇస్తామని చెప్పారు.

## ముంచుకొస్తున్న వానాకాలం
# ఇంకా పూర్తి కాని ప్రధాన వంతెనలు




ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ జిల్లా ఏజెన్సీలో వర్షాకాలం వచ్చిందంటే ప్రజ లకు ప్రత్యక్ష నరకమే. గూడేల నుంచి ప్రధానపట్టణాలకు రావాలంటే భగీరథ ప్రయత్నం చేయాల్సిందే. జిల్లాలోని 335పైగా ఆవాసాలకు నేటికీ అసలు రహదారి సౌకర్యమే లేదంటే ఉన్న గ్రామాలకు వాగులు, వంకల రూపంలో వర్షాకాలమంతా అష్టదిగ్బంధనమే. ఇటు ఆసిఫాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అయిదు ఏజెన్సీ మండలాలతో పాటు కాగజ్‌నగర్ డివిజన్‌లోని బెజ్జూరు, చింతలమానేపల్లి, దహెగాం, పెంచికలపేట, కాగజ్‌నగర్ వరకు అన్ని మండలాల్లో ప్రజలు ఒకే రకమైన ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈ ప్రాంతంలో చిన్నచిన్న వాగులు మొదలుకుని ఎర్రవాగు, పెద్దవాగు, ప్రాణహిత పరివాహక ప్రాంతంలోని వంకలపై నేటికీ వంతెనలు లేవు. దీంతో ప్రజానీకం బయట ప్రపంచానికి చేరుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. జిల్లాలో ఇలా చిన్నా చితక కల్వర్టు మొదలుకుని భారీ వంతెనల వరకు ఏవీ పూర్తి కాకపోవడంతో ఈ ఏడాది కూడా ప్రజానీకం ఇక్కట్లు పడే పరిస్థితి నెలకొంది. పనులను వేగిరం చేయాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ప్రతీ వర్షాకాలంలో ఈ సమస్యలు తప్పడం లేదని వివిధ మండలాలకు చెందిన ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి జిల్లాలో నెలకొంది. ప్రధాన వంతెనల నిర్మాణ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో ఈ ఏడాది కూడా ఆయా గ్రామాల ప్రజలు తిప్పలు పడాల్సిందే. గ్రామాలకు రవాణా కష్టం తీర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి పూర్తిస్థాయిలో చేరడం లేదు. మారుమూల గ్రామాల ప్రజలు ఇప్పటికీ కష్టాలు పడుతున్నారు. కాలంతో కుస్తీ పడుతూ సమస్యల సుడిగుండంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నారు. ఆసిఫాబాద్ మండలంలోని పెద్దవాగుపై గుండి వంతెన నిర్మాణ పనులు దశాబ్దన్నరగా కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుండి గ్రామానికి వర్షాకాలంలో వెళ్లడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కెరమెరి మండలంలోని ఉమ్రివంతెన అసంపూర్తిగా ఉండడం వల్ల మహారాష్ట్రలోని 12గ్రామాల ప్రజలకు రాకపోకలు వర్షాకాలంలో నిలిచిపోతాయి. అదేవిధంగా మం డలంలోని అనార్‌పల్లి–కరంజివాడ, లక్మాపూర్ వంతెనల నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. కాగజ్ నగర్–వాంకిడి మండలాల మధ్య కనర్‌గాం వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు 15సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ అసంపూర్తిగానే ఉంది. దీంతో ఆయాగ్రామాల ప్రజలు వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఇటీవల కురిసిన అకాలవర్షానికి గుండివాగుపై నిర్మించిన తాత్కలికవంతెన కొట్టుకుపోయిం ది. దీంతో గుండి ,కన్నర్‌గాం, నందూప, చోర్‌పల్లి గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గుండి వంతెన నిర్మాణ పనులు దశాబ్దన్నర కాలం పాటు కొనసాగుతుండటంతో ప్రతియేటా వర్షకాలంలో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. చిన్నపాటి వర్షం కురుసిన తాత్కలికవంతెన కొట్టుకుపొతుడటంతో వాగు దాటుకుంటూ పోవాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళలు, పిల్లలు, ద్విచక్రవాహనదారులు, చంటిపిల్లల తల్లులు ప్రమాదకరంగా నీటిలోనుంచి వాగును దాటుతున్నారు. వంతెన నిర్మాణపనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గుండి పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు 15ఏళ్లుగా నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

## ప్రసూతి శస్త్రచికిత్సలను ప్రోత్సహించే
# ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు

భువనగిరి : ప్రసూతి శస్త్రచికిత్సలను ప్రోత్సహించే ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచవో వై పాపారావు హెచ్చరించారు. జిల్లా కేంద్రం భువనగిరిలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యాధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. ఆస్పత్రుల్లోని బాలింతల, గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను అధికారులు అడిగి తెలుసుకున్నారు. వారి కేస్ షీట్లను పరిశీలించారు. పలువురికి అవసరం లేకున్నా ఉద్దేశపూర్వకంగా శస్త్రచికిత్సలు చేసినట్లు గుర్తించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ అనవసర శస్త్రచికిత్సలతో మాతాశిశు ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతుందన్నారు. అనర్హులు ఆసుపత్రులు నిర్వహించినా, శస్త్రచికిత్సలు చేసినా గుర్తింపు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సాధారణ కాన్పుతోనే సంపూర్ణ ఆరోగ్యమని గర్భిణులు గుర్తించాలన్నారు. జయలక్ష్మి, నిర్మల, కేకే ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించామని, ఇటీవలే ప్రిన్స, గాయత్రి, మహేంద్ర ఆస్పత్రులకు



నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచవో డాక్టర్ శిల్పిని,ఆఫీసర్ డాక్టర్ సుమన కల్యాణ్, డెమో మధుసూదనరెడ్డి, సీహెచవో నగేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ ఉత్పత్తులతోనే ఆరోగ్య రక్షణ

## ప్రకృతి వ్యవసాయ నిపుణుడు రమేష్



మోత్కూరు:గోఆధారిత, సేంద్రీయ సాగుతో పండించే పంటల ఆహార ఉత్పత్తులతోనే మానవాళికి ఆరోగ్య రక్షణ అని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ నిపుణుడు రంజాన రమేష్ అన్నారుమోత్కూరు ఆర్యవైశ్య భవనలో గోవర్ధనగిరి గోశాల, ఆదిగురు భారత ఫౌండేషన ఆధ్వర్యంలో ఓం సాయి చిల్డ్రన్స క్లినిక్ సహకారంతో రైతులకు సేంద్రీ య సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంతో పండించే పంటలతో తయారుచేసే ఆహార ఉత్పత్తులు విషపూరితమై మనుషుల ఆరోగ్యం పై ప్రభావం చూపుతోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్లో డిమాండ్ లేదనుకుంటే రైతులు తమ వరకైనా సేంద్రీయ పంటలు పండించి, ఆరోగ్యాలు కాపాడుకోవాలన్నారు. సేంద్రీయ ఉత్పత్తులను ప్రజలకు క్రమంగా పరిచయం చేస్తే వారే ఆ ఉత్పత్తులు కొనుగోలు చేస్తారన్నారు. విషతుల్యమైన ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసి భవిష్యత తరాలకు ముప్పు కలిగించవద్దని సూచించారు. గో ఆధారిత, సేంద్రీయ సాగు ఎలా చేయాలి, దానితో కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. సేంద్రీయ వ్యవసాయ రైతు బిల్లపాటి గోవర్ధనరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర గో సేవ ప్రముఖ్ ఆకుతోట రామారావు, దేశీయ విత్తన పరిరక్షకులు శ్రీకాంత, ఏబీఎస్ ఫౌండేషన వ్యవస్థాపకుడు గోపీమాధవ్, స్కందానంద సరస్వతి మాత, గోఆధారిత ఉత్పత్తుల నిపుణుడు కాంబోజు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల భూములపై నివేదిక ఇవ్వండి




అలంపూర్ : జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం చెన్నిపాడు చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి ఆలయ భూములపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ బీఎం సంతోష్ మానవపాడు తహసీల్దారును ఆదేశించారు. ఎండోమెంట్ కమిషనర్ కూడా ఆరా తీసినట్లు తెలిసింది. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆ భూముల అనుభవదారు తన నలుగురు కుమారులపై పట్టా చేసి, అమ్మ కానికి సిద్ధం చేశారని వార్త ప్రచురితమైంది. దాంతో బుధవారమే సంబంధిత సర్వే నంబర్ 155పై పూర్తి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టా మార్పిడి ఏ సంవత్సరంలో జరిగింది?, మార్పిడి వెనుక ఎవరి హస్తం ఉందన్న పూర్తి వివరాలు కోరినట్లు తెలిసింది. దీంతో మానవపాడు రెవెన్యూ కార్యాలయ అధికారులు సదరు ఆలయాల భూముల రికార్డులను పరిశీలించారు. గ్రామ పెద్దలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆలయాల భూములను కాపాడాలని, దేవాలయాల్లో సేవ చేసేందుకు ఎండోమెంట్ శాఖకు తమ పూర్వీకులు భూములు ఇచ్చారని గ్రామ పెద్దలు తెలిపారు. భూమిని అనుభవించే వారు టెంపుల్స్‌లో రోజూ మంగళవాయిద్యాలు వినిపించాలనే నిబంధన ఉన్నట్లు గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, తిరుమల్‌రెడ్డి, పుల్లారెడ్డి, జానేశ్వరరెడ్డి, రాజారెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు రెవెన్యూ అధికారులకు తెలిపారు. భూములపై పూర్తి నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందించనున్నట్లు మండల అధికారులు చెప్పారు. చెన్నిపాడు ఆలయాల భూముల బాగోతంపై దేవాదాయశాఖ ఆరా తీసినట్లు జిల్లా శాఖ అధికారులు తెలిపారు. భూములను పరిశీలించి నివేదిక కోరారని శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వరి తెలిపారు. అనుభవదారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని చెప్పారన్నారు. రెవెన్యూ అధికారులకు తమ వద్ద ఉన్న ఆధారాలు ఇస్తామని, పట్టామార్పిడికి కారణాలను విశ్లేషించాల్సి ఉందని అన్నారు.

# దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి

## తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్య క్షుడు పుర్క బాపురావు డిమాండ్

సిర్పూర్(యు) :జైనూర్ మండల కేంద్రంలో ఈనెల13న ఆదివాసీయువకుడు మర్సుకోల లక్ష్మణ్‌పై దాడిచేసిన వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్య క్షుడు పుర్క బాపురావు డిమాండ్ చేశారు. ఆయన మర్సుకోల లక్ష్మణ్ ఇంటికి వెళ్లి అతన్ని పరామర్శించారు. ఘటన జరిగిన తీరును బాధితుడిని డిగి తెలుసుకున్నారు. ఆదివాసీ యువకుడిపై హత్యా యత్నాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వలస వాదులు అక్రమంగా ఏజెన్సీ ప్రాంతంలో చొరబడి ఆదివాసీలపైనే దాడులకు పాల్ప డడం హేయమైన చర్య అన్నారు. ఏజెన్సీలో ఇలాంటి అల జడికి కారకు లైన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించా లన్నారు. జైనూర్ ఘటనలో గాయపడిన మర్సుకోల లక్ష్మణ్‌కు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి అట్రాసిటీ కేసు నమోదు చేయలన్నారు. లేనిపక్షంలో ఆదిలాబాద్ ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామన్నారు. మరుస్కోల లక్ష్మణ్‌ను బీజేపీ ఆసిఫా బాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట్నాక విజయ్‌కు మార్ బుధవారం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో పరా మర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. ధైర్యంగా ఉండా లని బీజేపీ ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. జైనూరు మండల కేంద్రంలో చిన్నచిన్న కారణాలతో హిందువులపై మూకుమ్మడిగా దాడి చేసిన దుండగులను




కఠినంగా శిక్షించాలని హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు సైదం నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలతో దాదాపుగా 500 మందితో ఒడ్డెరగూడలో దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా పోలీసులు దుండగులను కఠినంగా శిక్షించాలని అన్నారు. గొడవలకు కారణాలపై పూర్తి స్థాయిలో పారదర్శకంగా విచా రణ జరపాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో హిందువాహిని సభ్యులు జి ప్రణయ్, ఎ ప్రణయ్ తదితరులు ఉన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక
# సయ్యద్ తాలీబ్‌అలీషా బాబా దర్గా



సిర్పూర్(టి) :మండల కేంద్రంలోని డౌనల్ ఏరియాలో ఉన్న సయ్యద్ తాలీబ్ అలీషాబాబా దర్గా ఉర్సుఉత్సవాలకు సిద్ధ మైంది. ఈనెల 17, 18, 19తేదీల్లో జరిగే వేడుక లకు మంచిర్యాల, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, చెన్నూరు ఆదిలాబాద్, కౌటాల, ఉట్నూరు నుంచే కాక మహారాష్ట్రలోని అహిరి, చంద్రా పూర్, బల్లార్షా, తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరాను న్నారు. దర్గాను దర్శించుకొని ప్రత్యేకపూజలు చేస్తారు. తొలిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు, రెండో రోజు రాత్రి కవ్వాలి నిర్వహణకు సిద్ధమ య్యారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి నట్లు ఉత్సవకమిటీ సభ్యులు తెలి పారు. ఈ ఉత్సవాల కోసం ఆసిఫాబాద్, మంచిర్యాల ఆర్టీసీ డిపోలనుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. పూర్వీకుల కథనం ప్రకారం.. ఢిల్లీ నిజామొద్దీన్ వంశా నికి చెందిన హజరత్ సయ్యద్ తాలీబ్ అలీషా బాబా దాదాపు రెండు వందల సంవత్సరాల క్రితం చిన్న వయస్సులో పెన్‌గంగా, ప్రాణహిత నదులను దాటి లోనవెల్లి గ్రామం గుండా సిర్పూర్(టి)కి వచ్చారు. ఒక రోజు చిన్న పిల్లలు బాబా దగ్గరికి వచ్చి తమకు ఆకలి వేస్తోందని చెప్పగా ఆయన తన జోలె(సంచి)లో నుంచి వేడివేడి అన్నం పెడుతూ కనిపించారు. అలా బాబా మహిమలు చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించాయి. మహారాష్ట్రలో యుద్ధం చేసి ఓడిపోయిన ఓ రాజు తప్పించుకుని రాగా ఈబాబా ఆశ్రయం ఇచ్చారనే వార్తలు ప్రచారంలో ఉన్నాయి. మొత్తం మీద బాబా అనంతరం ఇక్కడ దర్గా నిర్మాణం జరిగింది. నాటి నుంచి దర్గా మత సామరస్యానికి ప్రతీకలా నిలుస్తోంది. ప్రతి గురు, శుక్రవారాల్లో ముస్లింలు, హిందువులు కలిసి దర్గాలో దీపారాధన చేస్తారు. ఏటా మూడు రోజుల పాటు ఉర్సు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడి బాబా ఆశీస్సులు పొందితే కోర్కెలు నెరవేరుతాయనే విశ్వాసం భక్తుల్లో ఉంది. అందువల్ల సిర్పూర్(టి) మండలంలోని అన్నిగ్రామాలతో పాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాల, దహెగాం, బెజ్జూరు, మహారాష్ట్రలోని రాజూరా, పోడ్సా తదితర గ్రామాల నుంచి భక్తులు కాలినడకన వస్తుంటారు. మొదటిరోజు ప్రత్యేకంగా గుర్రం సవారీతో బాబాకు ప్రత్యేకంగా చాదర్ ఏర్పాటు ఊరేగింపును కన్నుల పండువగా నిర్వహిస్తారు. కులమతాలకు అతీ తంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భక్తులు వేలాదిగా పాల్గొంటారు.

## జాతీయ రహదారి భూసేకరణ,
# విస్తరణ పనులు వేగవంతం చేయాలి

### - కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, : జాతీయ రహదారి పనులు, భూసేకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు నాగర్‌కర్నూల్ కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ సంబంధిత శాఖలైన రెవె న్యూ, జాతీయ రహదారి అధికారులతో భూసేకరణ ప నులు, జాతీయ రహదారి పురోగతి పనులపై సమీక్ష ని ర్వహించారు. జాతీయ రహదారికి సంబంధించి జిల్లా లోని కొల్లాపూర్ మండల పరిధిలోని వరిదేల గ్రామ పరి ధిలో భూసేకరణ పనులను వేగవంతం చేయాలని అం దుకు సంబంధించిన భూయాజమానులు, రైతులకు కా వాల్సిన నష్ట పరిహారాన్ని త్వరితగతిన చెల్లించేలా చ ర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలో నేషనల్ హైవే అభివృద్ధి పనులు, నేషనల్ హైవే 167కే కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 79కిలో మీటర్ల వరకు కొనసాగుతున్న విస్తరణ పనుల్లో వేగం పెంచాలన్నారు. లాండ్ ఆక్విజేషన్ పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి కావాలని, అవార్డు పరిహారం చె ల్లింపుల పురోగతిపై త్వరలో సమీక్షించనున్నట్లు తెలిపారు.నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాం తంగా జరిగేలా నిర్వహించడంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది తమవంతు బాధ్యతలను సమర్థవంతంగా, స్ఫూర్తిదాయకంగా నిర్వహించడంతోనే విజయవంతంగా పూర్తి చేయగలిగామని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలు విజయవంతంగా పూర్తి



కావడంతో ఎన్నికల అధికారులు, సిబ్బంది బుధ వారం కలెక్టరేట్‌లోని కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రి య ప్రశాంతంగా ముగియడంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది సమష్టి కృషి వల్లనే జిల్లాలో ఎన్నికలు విజయ వంతమయ్యాయని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ప్రశాంత వాతావరణం లో ఎన్నికలు నిర్వహించడం చాలా సంతోషమని ఆయ న అన్నారు. ఎన్నికల సిబ్బందికి అన్ని వసతులు కల్పిం చడం, నాణ్యమైన భోజనాన్ని అందించడంలో అధికార యంత్రాంగం సఫలీకృతమైందన్నారు. ఎన్నికల ప్రక్రియ లో భాగస్వాములైన అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ ఈ సందర్శంగా ప్రశంసించారు. కలెక్టరేట్ ఏవో చంద్ర శేఖర్, వివిధ విభాగాల ఎన్నికల నోడల్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# జోరుగా ఒండ్రు అక్రమ రవాణా



మక్తల్, : మండలంలోని మంథన్‌గోడ్ పెద్ద చెరువు నుంచి ఒండ్రు మట్టి అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. మట్టి తరలించేందుకు అనుమతులు తీసుకోవల్సి ఉన్నా.. అవేవీ పట్టించుకోకుండా ఇష్టారీతిగా ఒండ్రును తరలిస్తున్నారు. చెరువులో రెండు భారీ పొక్లెయినర్లు ఉం చి 50 ట్రాక్టర్ల ద్వారా పెద్ద ఎత్తున ఒండ్రు మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. మండలంలోని గుడిగండ్ల, జక్లేర్, జౌళాపురం, రామసముద్రం, బొందల్‌కుంట గ్రామాల సమీపంలో జాతీయ రహదారి పొడవున పెద్ద సంఖ్యలో ఇటుక బట్టీలు వెలిశాయి. ఉన్న నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా ఒండ్రును తరలించి సొమ్ము చేసుకుంటారు. ఉన్నతాధికారులకు ఈ విషయం తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొంత మంది ఫిర్యాదు చేసినా కనీసం పరిశీలనకు సైతం రావడం లేదని పలువురు అంటున్నారు. రైతుల పంట పొలాలకు ఒండ్రును తరలించాల్సింది పోయి అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఒండ్రు మట్టికి అడ్డుకట్ట వేయా లని చుట్టుపక్కల గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సువర్ణరాజును వివరణ కోరగా.. తాను మహబూబ్‌నగర్‌లోని ఈవీఎంలు భద్ర పరిచిన స్ట్రాంగ్ రూం వద్ద ఉన్నట్లు తెలిపారు.

## సంపాదకీయం

మంగళవారం, మే 21, 2024

# జీవజాతులు అంతరిస్తే జీవవైవిధ్యానికి విఘాతం..!

“సమస్త వణ్యప్రాణులు గ్రంధాలయంలో చదివిన, చదవని పుస్తకాల లాంటివి. వణ్యప్రాణులను గుర్తించక పూర్వమే వాటి వినాశనం జరిగితే పుస్తకాలను చదవకుండానే గ్రంధాలయం అగ్నికి ఆహుతి అయినట్లు భావించాలని” అని ప్రముఖ శాస్త్రజ్ఞుడు జాన్ దిన్‌జల్ అభిప్రాయపడ్డారు. వన్యప్రాణులను అంతరించకుండా కాపాడుకోవడం, వాటి జనాభా తగ్గకుండా చూడడం, జీవ వైవిధ్యాలను పరిరక్షించడం అనే లక్ష్యంతో “డిజిటల్ పరిజ్ఞానంతో వన్యప్రాణుల రక్షణ” అనబడే నినాద అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం మన కర్తవ్యం కావాలి. వన్యప్రాణి శరనార్థి జీవజాతులు, జంతు ప్రదర్శనశాలలు, మ్యాజియమ్స్, నందనవనాలు, పౌర సంఘాలు, యన్‌జిఓలు, విద్యావేత్తలు, నిపుణులు, జంతు ప్రేమికులు లాంటి వర్గాలు అంతరించే ప్రమాదపు అంచున ఉన్న జీవజాతుల పరిరక్షణ, పునరుద్ధరణ ప్రయత్నాలు, అవగాహన లాంటి వివిధ కార్యక్రమాలు రూపొందించడానికి ఈ వేదికలు వినియోగపడతాయి. భూమండలంపై జీవరాసుల ఆవిర్భావం నుంచి నేటి వరకు అనేక రకాలైన జీవజాతులు భౌతిక శారీరక పరివర్తనం, బయలాజికల్ స్థితులు, వాతావరణ మార్పులను బట్టి నెమ్మదిగా అంతరించడం ప్రకృతి నియమంగా జరుగుతూనే ఉన్నది. నేటి డిజిటల్ యుగపు మానవుడు చేస్తున్న వికృత పర్యావరణ వ్యతిరేక కార్యాలతో వేగంగా పలు జీవజాతుల అంతరిస్తున్నాయని, అంతరించే ప్రమాదపు లేదా విలుప్తత లేదా విపత్తు అంచున ఉన్నాయనే విషయం జంతు ప్రేమికులను కలవరపెడుతున్నది. మానవ ప్రమేయంతో అతివేగంగా అంతరించే ప్రమాదపు అంచున ఉన్న జీవజాతులను ‘విపత్తు లేదా అంతరించే అంచున ఉన్న జీవజాతులు(ఎండేంజర్డ్ స్పీసీస్)’ అంటాం. అడవు నరికివేత, కార్చిచ్చులు, వాతావరణ ప్రతికూల మార్పులు, వణ్యప్రాణి అక్రమ రవాణా లాంటి పలు కారణాలతో అంతరించే అంచున జీవజాతులు ఉండడం విచారకరం. అంతరించే దుస్థితిలో ఉన్న జీవజాతులను గుర్తించి వాటి పరిరక్షణకు కంకణబద్ధులం కావాలని, లేని యెడల జీవవైవిధ్యానికి విఘాతం కలిగి ప్రాణికోటి మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. అంతరించే జాతులను గుర్తించడానికి కొన్ని ప్రమాణాలను నిర్ణయించారు. ఒకేరకమైన జీవజాతి 10 ఏళ్లలో 50–70 శాతం జనాభా తగ్గడం, జీవజాతుల నివాసాల వైశాల్యం పూర్తిగా తగ్గడం, జీవజాతి జనాభా 2,500 వరకు తగ్గడం, జీవజాతి జనాభా 250 ఉన్నప్పుడు రానున్న రెండు దశాబ్దాల్లో అవి అంతరిస్తాయని గమనించాలి. సమస్త జీవజాతుల్లో 27 శాతం, అనగా 41,000 జాతులు అంతరిస్తున్నాయని గణాంకాలు తెలుపుతున్నాయి. మానవ అనాలోచిత ప్రమేయం, సహజ నివాస స్థలం ప్రభావితం కావడం, కొత్త జీవజాతులను సహజ నివాసాల్లో వదలడం, అతి వేట, కాలుష్యం, జీవజాతులకు రోగాలు, అడవుల నరికివేత, ప్రపంచ జనాభా పెరగడం, అపరిమిత ప్రణాళికారహిత పట్టణీకరణ, అర్థరహిత అభివృద్ధి, వాతావరణ ప్రతికూల మార్పులు, జన్యుపరమైన మార్పులు వంటి కారణాలతో పలు జీవజాతులు వేగంగా అంతరిస్తున్నాయని గమనించారు. రానున్న రెండు దశాబ్దాల్లో కనీసం 500లకు పైగా జీవజాతులు అంతరిస్తాయని కూడా విశ్లేషిస్తున్నారు.

## విద్యుత్ సర్క్యూట్ తో చెలరేగిన మంటలు



తెలంగాణ క్యాపిటల్ న్యూస్ శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన రైతులు కాసం దామోదర్ రెడ్డి, పిన్ రెడ్డి తిరుపతిరెడ్డి, పిన్ రెడ్డి వెంకటరమణారెడ్డి రైతుల వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ షాట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి మోటారు పైపులు, బెల్టులు, మోటార్లు వైర్లు కాల్ పోయినవనీ రైతులకు 40 వేల ఆస్తి నష్టం జరిగిందని రైతులు తెలిపారు.

## ఘనంగా స్థాపిత దేవతార్చన, శ్రీ చక్రార్చన పూజలు



తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం: గన్నేరువరం మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామంలోని శ్రీ స్వయంభూ మానసా దేవి , అపురూప లక్ష్మి దేవాలయంలో ఆరవ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈసందర్భంగా ఆలయ అర్చకులు పెండ్యాల అమర్నాథ్ శర్మ ఆధ్వర్యంలో రెండవ రోజు చండీ హెూమం నిర్వహించారు.స్థాపిత దేవతార్చన, శ్రీచక్రార్చన, త్రిశూల స్నానం, భస్మాభిషేకం, సర్ప మంత్ర సంపుటీకృత అభిషేకం,బగళాముఖీ మహా విద్యా హెూమం, నిరాజనం, మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి తీర్థ ప్రసాద వితరణ,అన్నదానం నిర్వహించారు.ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవాళ్లను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, స్వప్న, గౌరవ అధ్యక్షులు బద్దం చిన్న నరసింహారెడ్డి, గంప వెంకన్న, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం: గన్నేరువరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు 2006– 2007 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గన్నేరువరం మండల కేంద్రం శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరుపుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. ఉపాధ్యాయులు కలిసి సరస్వతి చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు మెమొంట్ ఇచ్చి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు అందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలో కలసి తిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు. తమ విద్య, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు కుటుంబ నేపథ్యాల విషయాల గురించి ఒకరికొకరు తమపిల్లలు చదువుల గురించి వివరాలు చెప్పుకుంటు ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు.అనంతరం తోటి విద్యార్థులు వివిధ రకాలుగా మరణించడంతో రెండు నిమిషాలు ఉపాధ్యాయులతో మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రిటైర్డ్ హెచ్ఎం మాధవరెడ్డి, లక్ష్మయ్య,పిఈటీ సంపత్ రావు, తిరుపతి రెడ్డి, అబ్దుల్ బాసిక్, లక్ష్మీనారాయణ చారి, టైపిస్ట్ రామస్వామి, శ్రీమన్ రావు, మల్లేశం,అల్లూరి శ్రీనాథ్ రెడ్డి,బుర్ర రాజ్ కోటి గౌడ్,మహేందర్ రెడ్డి,నక్క తిరుపతి, తిప్పర్తి పరిపూర్ణ చారి, సంజువ్,కూన రమాదేవి,శ్రీయత, శ్రీవాని,సంగీత, సాగరిక, సరితా, మమత,నవిత,స్రవంతి,లత,సమత, సంతోషిని,శారద తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పిట్టల భూమేశ్ జన్మదిన వేడుకలు


## - జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు





తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల పట్టణం : ప్రముఖ న్యాయవాది కాంగ్రెస్ పార్టీ నాయకుడు పిట్టల భూమేష్ ముదిరాజ్ 50వ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆసుపత్రుల్లో పళ్ళు బ్రేడ్ పంపిణీ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గత ఇరవై సంవత్సరాల పైగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు వారిసాదకబాదకాల్లో తల్లోనాలుకగా ఉంటూ ప్రజా పోరాటాలు చేసిన నాయకుడు పిట్టల భూమేష్ అని ముదిరాజు సామాజికవర్గ సమాస్యలపైన,బిసి,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రయోజనాల కోసం, పరితపిస్తూ అనునిత్యం ప్రజల్లో ఉన్న నాయకుడు పిట్టల భూమేష్ ప్రజా ప్రయోజనం కోసమే రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ బలోపేతంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ల సంఘం వ్యవస్థాపకుడు బొడ్డు దేవయ్య,రాష్ట్ర ప్రధన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి,జిల్లా అధ్యక్షుడు మిర్యాల్కర్ శ్రీనివాస్, ఎడ్ల రాజ్ కుమార్, ఉస్మానియా యునివర్సిటీ జే ఎ సి నాయకుడు లింగంపల్లి రవితేజ, సామల వెంకన్న, లింగంపల్లి మధూకర్, సంపునూరి మల్లేశం గౌడ్,గుడిసె రమేష్, లింగంపల్లి మహేష్, సందీప్ కుమార్, అందె ఈశ్వర్,అందె శ్రీనివాస్, సాయి చంద్, తదితరులు పాల్గొన్నారు

## రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తహసీల్దార్‌కు బీజేపీ వినతి పత్రం



తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ముస్తాబాద్: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఆదేశాల మేరకు మండల బిజెపి అధ్యక్షులు మెరుగు అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మెరుగు అంజగౌడ్ మండల, ప్రధాన కార్యదర్శి బాధ నరేష్, జిల్లా అధికార ప్రతినిది మల్లారపు సంతోష్ రెడ్డి జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, మెంగని మహేందర్, కరేడ్ల రమేష్ గూడ బాల్ రెడ్డి, మీసా స్వామి చికోటీ మహేష్, ఒరగంటి సత్యం, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ఎన్నికల హామీలు నెరవేర్చు కోవాలి


## - రైతులకు 500 బోనస్ ఇవ్వాలి - తహశీల్దార్ కు బిజెపి వినతి పత్రం



తహశీల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా రైతుల ధాన్యానికి క్వింటాలుకు 500 బోనస్ చెల్లిస్తామని చెప్పిన విధంగా రైతులకు వెంటనే చెల్లించాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ బిక్షపతికి వినతి పత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్ర రైతాంగానికి అధికారంలోకి రాగానే వరి ధాన్యం క్వింటాల్ రూ.500 తక్షణం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిగంటి సత్తయ్య ,బండి తిరుపతి,మహేందర్ ,కుర్ర హరీష్, బుర్ర శ్రీను,రాజు తదితరులు పాల్గొన్నారు.

# అనసూయ భరద్వాజ్ పుట్టినరోజు సెలబ్రేషన్స్ ఫొటోలు










# ఓటీటీలోకి రాబోతున్న సుహాస్ 'ప్రసన్నవదనం'

యంగ్ హీరో సుహాస్ నటించిన తాజా చిత్రం 'ప్రసన్నవదనం'. ఈ సినిమాకు ప్రముఖ దర్శకుడు సుకుమార్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన అర్జున్ వైకే దర్శకత్వం వహించగా.. పాయల్ రాధాకృష్ణ, రాశీ సింగ్ హీరోయిన్లుగా నటించారు. లిటిల్ థాట్స్ సినిమాస్, అర్హ మీడియా బ్యానర్‌పై మణికంఠ ప్రసాద్ రెడ్డి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించారు. మే 03న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం క్రైమ్ థ్రిల్లర్‌గా ఆకట్టుకుంది. అయితే ఈ సినిమా వచ్చి 20 రోజులు కూడా కాకముందే ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక 'ఆహా'లో ఈనెల 24 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అయితే 'ఆహా' గోల్డ్' సబ్‌స్క్రిప్షన్ ఉన్నవారికి ఒకరోజు ముందుగానే అందుబాటులోకి రానున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ప్రముఖ రేడియో కంపెనీలో ఆర్‌జేగా పని చేస్తుంటాడు సూర్య (సుహాస్). అయితే అనుకోకుండా సూర్య లైఫ్‌లో ఒక ప్రమాదం జరుగుతుంది. ఈ ప్రమాదం వలన సూర్య అమ్మానాన్నల్ని కోల్పోవడంతోపాటు.. ఫేస్ బ్లైండ్‌నెస్ (ప్రోసోపాగ్నోసియా) సమస్య బారిన పడతాడు. ప్రోసోపాగ్నోసియా వ్యాధి వచ్చిన వారు ఒక వ్యక్తికి సంబంధించి మొహం తప్ప అన్నీ గుర్తుపడతారు. అయితే ఈ వ్యాధి ఉన్న సుహాస్ ముందు ఓ హత్య జరుగుతుంది. తనకున్న సమస్యతో ఆ హత్య ఎవరు చేశారో తెలుసుకోలేడు. కానీ, పోలీసులకి ఈ విషయం తెలిపేందుకు ప్రయత్నిస్తాడు. అయితే ఈ విషయం పోలీసులకు చేప్పే లోపే అతడిపై దాడి జరుగుతుంది. ఈ క్రమంలోనే సూర్య ఏం చేశాడు. మర్డర్ చేసిన వ్యక్తిని ఎలా గుర్తుపట్టాడు అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.




## కేన్స్‌లో మెరిసిన రామ్ చరణ్ హీరోయిన్..

### హై-స్లిట్ గౌనులో ఆకట్టుకున్న కియారా అద్వానీ



ఫ్రాన్స్‌లో 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతోంది. ఈ వేడుకల్లో బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్స్ సందడి చేస్తున్నారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన డ్రెస్‌లను ధరించి రెడ్ కార్పెట్‌పై హొయలు పోతున్నారు. ఇక టాలీవుడ్ స్టార్ రామ్ చరణ్ హీరోయిన్ కియారా అద్వానీ తొలిసారిగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. లోరియల్ ప్యారిస్ బ్రాండ్ అంబాసిడర్‌లలో ఒకరైన కియారా అద్వానీ కేన్స్‌లో వానిటీ ఫెయిర్ హోస్ట్ చేస్తున్న రెడ్ సీ ఫిల్మ్ ఫౌండేషన్ ఉమెన్ ఇన్ సినిమా గాలా డిన్నర్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. ఈ సందర్భంగా ప్రబల్ గురుంగ్ డిజైన్ చేసిన హై-స్లిట్ గౌనులో మెరిసిపోయింది. సింపుల్ మేకప్, పెద్ద చెవిపోగులతో మరింత ఆకర్షణీయంగా కనిపించింది. అక్కడ ఫొటోషూట్‌కు సంబంధించిన చిన్న వీడియో క్లిప్‌ని కియారా తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది.